News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక


Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :162 | ఖమ్మం | సోమవారం, జూలై 20, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## పార్లమెంట్ సమావేశాలకు సర్వం సిద్ధం

- 8 బిల్లులతో కేంద్రం రెడీ
- నీట్, అయోధ్య అంశాలపై పోరుకు విపక్షాలు సై
- సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు
- సభలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరిన కేంద్రం
- సభలో ప్రవేశపెట్టనున్న ఎనిమిది బిల్లులు



## అఖిలపక్ష సమావేశాన్ని బహిష్కరించిన విపక్షాలు

- ఎన్సీపీఐకి ఆహ్వానంపై అభ్యంతరం
- స్పీకర్ గుర్తింపు లేదన్న తృణమూల్
- వెబ్‌సైట్‌లో ఇంకా టీఎంసీ సభ్యులే
- రెబల్ ఎంపీల పార్టీపై వివాదం
- ఆహ్వానానికి కృతజ్ఞత తెలిపిన ఎన్సీపీఐ





### ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే

# బాధ్యత

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు
- సర్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం
- పార్టీ ముఖ్యనేతలకు పలు కీలక సూచనలు చేసిన సీఎం
- సర్‌ను ఇన్‌ఛార్జ్ మంత్రులు పూర్తి పర్యవేక్షణ చేయాల్సిందే

హైదరాబాద్

ఛైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, రేపటి నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్ఐఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్ప టికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశిం చారు. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఛైర్మన్లు బీఎల్ఓల నివేదికల కంటే బీఎల్ఏల

వివరాలు 2లో..




## పేదల సొంతింటి కల సాకారం దిశగా

- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్
- క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు

హైదరాబాద్

లహైదరాబాద్‌లోని పేదల సొంతింటి కలను నిజం చేయబోతున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'క్యూర్' పరిధిలో లక్ష ఎల్?ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం శ్రీకారం చుట్టబోతున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను సోమవారం

వివరాలు 2లో..

## అక్రమ ఫీజులకు అడ్డుకట్ట!




- తరగతుల వారిగా ట్యూషన్ ఫీజు వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి
- స్కూళ్లకు విద్యాశాఖ ఆదేశాలు
- 2023-24, 2024-25 నాటి వార్షిక పరిపాలనా నివేదికలు, ఆడిట్ నివేదికలు సమర్పించాలని ఆదేశం
- ఈ నెల 30వ తేదీలోపు సైట్‌లో అప్‌లోడ్
- లేదంటే సంబంధిత స్కూల్‌కు షో-కాజ్ నోటీసులు



## చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి

- తొలిసారిగా మాల్డోవా, నార్త్ మాసిడోనియాకు!
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు దేశాల పర్యటనకు శ్రీకారం
- తొలిసారిగా మాల్డోవా, నార్త్ మెసిడోనియాకు వెళ్లనున్న భారత రాష్ట్రపతి
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియాలో ముర్ము పర్యటన
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండాగా ఈ చారిత్రక యాత్ర

## గృహజ్యోతిపై ఎల్‌నినో ప్రభావం

- ఎల్‌నినో ఎఫెక్ట్‌తో తగ్గిన గృహజ్యోతి వెలుగులు
- జీరో బిల్లుకు దూరమవుతున్న లబ్ధిదారులు
- వర్షాభావ పరిస్థితుల వల్ల పెరుగుతున్న ఉక్కపోత
- ఎక్కువగా విద్యుత్ వాడుతూ జీరో బిల్లుకు దూరం
- ఉచిత కరెంటు బిల్లు పొందే అవకాశాన్ని కోల్పోయిన 7 శాతం మంది



హైదరాబాద్

వర్షాకాలం మొదలై నెలన్నరవుతోంది. కానీ వానల జాడ మాత్రం లేదు. ఎల్‌నినో ప్రభావంతో వానదేవుడు కురవకుండా మొఖం చాటేశాడు. వర్షాభావ పరిస్థితుల్లో ఎండ తీవ్రత వల్ల ఉక్కపోత ఎక్కువగానే ఉంది. జులైలోనూ ఏసీలు, కూలర్లు నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి దారుణమైన పరిస్థితులు లేవని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ ప్రభావం గృహజ్యోతి పథకంపై పడుతుంది. విద్యుత్తును ఎక్కువగా వాడడం వల్ల చాలా మంది లబ్ధిదారులు జీరో బిల్లుకు దూరమవుతున్నారు. గతేడాది పోలిస్తే ఈసారి 7 శాతం మంది ఉచితంగా

వివరాలు 2లో..

# ఈ స్కూళ్లలో సీటొస్తే కార్పొరేట్ స్థాయి విద్య ఉచితం

విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు, నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో కేంద్రప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. విద్యతో పాటు సామాజిక, నైతిక అంశాలపై అవగాహన, క్రీడలు, వ్యాయామాల్లో విద్యార్థులు రాణించే విధంగా నవోదయ పాఠశాలలు కృషి చేస్తున్నాయి. 2027-28 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నవోదయ విద్యాలయ సంస్థ ప్రకటన విడుదల చేసింది. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తునకు చివరి తేదీ తదితర వివరాలు తెలుసుకుందాం.



**కార్పొరేట్‌కు దీటుగా బోధన**

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యా బోధనను నవోదయ విద్యాసంస్థల్లో అందిస్తున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహాలు. పాఠశాల సిబ్బందికి అక్కడే నివాస సముదాయాలు, గేమ్స్ కోసం స్పోర్ట్స్ గ్రౌండ్ లాంటి ఎన్నో సదుపాయాలు ఈ పాఠశాలల ఆవరణలో ఉంటాయి. ఎన్?సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ లాంటి క్రమశిక్షణ అలవర్చే సంస్థలు కూడా ఉన్నాయి.

**అర్హతలు ఇవీ :**

ప్రస్తుత అకాడమిక్ ఇయర్?లో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులై ఉండాలి.

నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత ఉమ్మడి జిల్లా పరిధిలో నివాసులై ఉండాలి.

మే 1, 2015 నుంచి జులై 31వ తేదీ, 2017 మధ్య జన్మించిన వారే అర్హులు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయించారు. వారు 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంత బడుల్లోనే చదివి ఉండాలి.

మొత్తం సీట్లలో కనీసం 3వ వంతు బాలికలకు కేటాయింపు ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ దివ్యాంగ విద్యార్థులకు కేంద్రం నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ప్రతిభ కనబరిస్తేనే : 40 సీట్లకు గాను ప్రవేశ పరీక్ష 3 విభాగాల్లో నిర్వహిస్తారు. అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీ అండ్ ఎన్విరాన్మెంటల్ స్టడీస్, లాంగ్వేజ్ టెస్ట్ సంబంధించిన 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్, మరాఠీ, కన్నడ మాధ్యమాల్లో ఉంటుంది. ఒక్కో సమాధానానికి 1.25 మార్కుల చొప్పున 100 మార్కులుగా లెక్కిస్తారు. ఇందులో ప్రతిభ చూపితేనే నవోదయంలో ప్రవేశం కల్పిస్తారు.

దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ ఎప్పుడంటే ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా నవోదయ అధికారిక వెబ్‌సైట్?ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఫొటో, విద్యార్థి సంతకం, తల్లిదండ్రుల సంతకం, ధ్రువీకరణ పత్రం(రెసిడెన్స్), ఆధార్ వివరాలు, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు వంటివి అప్‌లోడ్ చేయాలి. ఎలాంటి ఫీజు ఉండదు. నవోదయ ప్రవేశ పరీక్ష సెప్టెంబరు 28వ తేదీన నిర్వహిస్తారు. అనంతరం వీటి ఫలితాలను 2027 మార్చి/ఏప్రిల్‌లో వెల్లడిస్తారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా అభ్యర్థులకు సీటు కేటాయిస్తారు. నవోదయల్లో ప్రవేశం పొందిన వారికి ఇంటర్? వరకు పూర్తిగా ఉచిత విద్య, నాణ్యమైన భోజనంతో పాటు ఇతర విద్యా సౌకర్యాలను కల్పిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో విద్యను అందించి భాషా నైపుణ్యాలను పెంపొందిస్తారు.

### రాష్ట్రంలో మొట్టమొదటి సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ

# రూ.300 కోట్లతో నిర్మాణం

తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్?పామ్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో గోద్రెజ్? ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ పరిశ్రమను నిర్మించింది. దీనిని ఈ నెల 20 సోమవారం ప్రారంభించడానికి సంస్థ కావాల్సిన ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.



**113.5 ఎకరాలను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం**

ఆంధ్రప్రదేశ్‌లోని సీతంపేటలో పరిశ్రమ నెలకొల్పిన గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ అంజనాపురంలో సమీకృత పరిశ్రమ స్థాపనకు ముందుకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం 113.5 ఎకరాలను కేటాయించింది. రూ.300 కోట్ల పెట్టుబడితో సంస్థ ఈ పరిశ్రమను ఏర్పాటు చేసింది. దీని ద్వారా 700 మంది వరకు ఉపాధి పొందనున్నారు. ఇందులో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు మొదలుపెట్టి మూడు లక్షల మొక్కలు పెంచుతున్నారు. 1.40 లక్షల మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధిలోకి సంగారెడ్డి జిల్లాతోపాటుగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని 12 మండలాలు కేటాయించారు.

**నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు పరిశ్రమలు**

ప్రైవేటు సమీకృత ఆయిల్?పామ్ పరిశ్రమతో రాష్ట్రంలో సంఖ్య నాలుగుకు చేరుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లాలో నర్మెటాలో గంటకు 30 టన్నుల సామర్థ్యం ఉన్న పరిశ్రమలున్నాయి. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యం కలిగి ఉంది. ఇంకా మరో ఆరు కర్మాగారాలు కల్లూరుగూడెం(ఖమ్మం), ఇంచర్ల(ములుగు), బీచ్‌పల్లి(గద్వాల), పెద్దరాత్‌పల్లి(పెద్దపల్లి), సంకిరెడ్డిపల్లి (వనపర్తి), యాచారం(నల్గొండ)లలో నిర్మాణాలలో ఉన్నాయి. అయితే ఈ ఏడాది చివరి నాటికి వీటిని పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

### కల్తీ రాయుళ్లపై హెచ్-ఫాస్ట్ యాక్షన్ షురూ!

# ఆహార కల్తీకి పాల్పడిన ఆరుగురు అరెస్టు

కొంతమంది అక్రమార్కులు ఆహార పదార్థాలను విచ్చలవిడిగా కల్తీ చేస్తూ సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. రసాయనాలు, నాణ్యత లేని కల్తీ ఆహారపదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కల్తీ రాయుళ్లపై హెచ్-ఫాస్ట్ కొరడా ఝులిపించింది. ఈ మేరకు నగరంలోని బహదూర్‌పురా, కిషన్‌బాగ్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, బేగంబజార్‌లో హెచ్-ఫాస్ట్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆహార కల్తీకి పాల్పడుతున్న ఆరుగురు వ్యాపారులను అరెస్టు చేశారు.

**వాడిన నూనెలే పదేపదే వినియోగిస్తూ**

లఅధికారుల తనిఖీలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహారపదార్థాలు తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. వాడిన నూనెను పదేపదే వాడుతూ, ప్రమాదకర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఆహారం తయారీలో గడువు తీరిన పదార్థాలను నిర్వాహకులు వాడుతున్నట్లుగా గుర్తించారు. ఎఫ్?ఎస్?ఎస్?ఏఐ గుర్తింపు లేకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. కల్తీ ఆహారంపై టోల్?ఫ్రీ నంబర్? 87126 61212కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.



**ఆహార కల్తీపై కఠిన చట్టం**

ఆహార, ఔషధాల కల్తీ నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని శనివారం జరిగిన సమావేశంలో అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాలు కల్తీమయం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై ఎంసీహెచ్‌ఆర్డీలో రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లను త్వరగా మగ్గించేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు.

**ఆహార పదార్థాల కల్తీపై సమీక్ష**

ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం కారణంగా పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకునేందుకు విదేశాలు నిరాకరిస్తున్నాయని వివరించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నారని, అయితే అవి ఆర్గానిక్ ఉత్పత్తులేనని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవని అధికారులతో సమీక్ష సందర్భంగా రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారుల సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లుగా ఆయన తెలిపారు.

## ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.

**ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత**

గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్?ఛార్జిల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.ల ఇవాళ ఉదయం జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నిర్వహంచిన జూమ్ సమావేశంలో రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎస్ఐఆర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## గృహజ్యోతిపై ఎల్‌నినో ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

కరెంటు బిల్లు పొందే అవకాశాన్ని కోల్పోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఇందుకోసం 2023లో డిసెంబర్ నెలలో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించింది. 2024 ఫిబ్రవరి నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ప్రతి నెలా కరీంనగర్ జిల్లాలో లబ్ధిదారులు రూ.8.50 కోట్ల వరకు లబ్ధి పొందుతున్నారు. పథకం ఆరంభమైనప్పటి నుంచి గడిచిన రెండున్నరేళ్లలో వినియోగదారులకు రూ.199.39 కోట్లు ఆదా అయ్యాయి. గడిచిన వేసవిలో వినియోగం పెరగడం, తాజా ఎల్?నినో పరిస్థితుల వల్ల ప్రతి నెలా లబ్ధి పొందే మొత్తం రూ.7.50 కోట్లకు తగ్గింది. గృహజ్యోతి పథకం కింద ప్రతినెలా ఉచిత విద్యుత్తు పొందాలంటే పొదుపుగా వాడుకొని 200 యూనిట్ల వినియోగం దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు.

**రోజువారీ కోటా కంటే ఎక్కువగా వినియోగం**

జిల్లాలో ప్రస్తుతం గృహజ్యోతి వినియోగదారులు 214,105 మంది ఉన్నారు. గత జూన్? నెలలో 1,78,805 మందికి అంటే (83 శాతం) మాత్రమే ఉచిత విద్యుత్తును పొందారు. గత సంవత్సరం ఇదే నెలలో 2,05,985 గృహజ్యోతి కనెక్షన్లకు 1,86,203 (90 శాతం) ఉచిత విద్యుత్తును పొందారు. అంటే గతేడాది మొత్తం లబ్ధిదారుల సంఖ్య తక్కువ అయినప్పటికీ ఎక్కువ మందికి పథకం లభించింది. ఈ సంవత్సరం కనెక్షన్ల సంఖ్య పెరిగినా వినియోగం పెరగడంతో లబ్ధి పొందిన వారి సంఖ్య మాత్రం తగ్గింది. ప్రస్తుతం జిల్లాలో రోజువారీ విద్యుత్తు కోటా 4.03 మిలియన్? యూనిట్లకు 4.97 మిలియన్ యూనిట్ల వాడకం జరుగుతోందని, ఈ నెలలో వినియోగం పెరిగిందని ఎన్?పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

## పేదల సొంతింటి కల సాకారం దిశగా

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల విలువైన ప్రాంతాలను గుర్తించినట్లుగా వివరించారు. అధునాతన సౌకర్యాలతో పది అంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టి పేదలకు అందిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని వివరించారు. రెండో విడతలో ప్రకటించిన 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా నగరంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా సాకారం చేయబోతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

**నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు**

గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గతేడాది మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో రెండు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, లక్షలాది కుటుంబాలు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుదుతున్నామని, గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## అక్రమ ఫీజులకు చెక్!

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసే పనిలో ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం ఒక ఆదేశం జారీ చేశారు. దీని ప్రకారం పాఠశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2026-27) సంబంధించిన తరగతుల వారీగా వసూలు చేసే ట్యూషన్ ఫీజు వివరాలను తమ నోటీసు బోర్డులు, వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ప్రదర్శించాలి. అలాగే 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన వార్షిక పరిపాలనా నివేదికలు చార్టర్డ్ అకౌంటెంట్ ధృవీకరించిన ఆడిట్ నివేదికలను, ఈ నెల 30వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

**సమర్పించకపోతే షోకాజ్ నోటీసులు**

ఉమ్మడి రాష్ట్రంలో 1994 జనవరి 1న జారీ చేసిన జీవో నం.1 ప్రకారం పాఠశాలలు ఏటా విద్యాశాఖకు ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని సంవత్సరాలు విద్యాశాఖ వాటిని అడగలేదు. అలాగే పాఠశాలలు కూడా సమర్పించలేదు. ఇప్పుడు వాటిని సమర్పించాలంటూ అధికారిక ఆదేశాలు జారీ కావడం గమనార్హం. గడువులోగా నివేదికలు సమర్పించకపోతే సంబంధిత పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12,000 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలలు ఏటా ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతున్నాయని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఈ ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే ముసాయిదా బిల్లును సిద్ధం చేశారు. ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ ముసాయిదాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరిలో ఆదేశించారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎస్ శ్రీధర్ అధికారులతో ఫీజు నియంత్రణపై చర్చించి ప్రస్తుత ఫీజు వివరాలతోపాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా తరగతుల వారీగా ఫీజు వివరాలను ప్రదర్శించాలని ఆడిట్ నివేదికలను సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి మంత్రివర్గంలో చర్చించిన తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. మొత్తంమీద 2027-28 విద్యా సంవత్సరం నాటికి ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనా.

## డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ గారికి ఘన స్వాగతం పలికిన బోథ్ మండల కన్వీనర్ మేరుగు భోజన్న



సికే న్యూస్ బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బోథ్ మండలానికి విచ్చేసిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు నరేష్ జాదవ్ గారికి బోథ్ మండల కన్వీనర్ మేరుగు భోజన్న శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నరేష్ జాదవ్ గారికి ఆత్మీయంగా ఆహ్వానం తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బోథ్ ఏఎంసీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి, జిల్లా ఎస్సీ సెల్ అట్రాసిటీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ నాయకులు బొజ్జ సాయన్న, అబూద్, సోనాల మండల కన్వీనర్ పోతన్న, అబ్రర్, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంచగూడెంలో ఘనంగా అమరవీరుల వర్ధంతి



సికే న్యూస్ మహబూబాబాద్ జిల్లా (పతినిధి దుర్గం మురళి జులై 19 :మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం ఎంచగూడెంలో సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర నాయకులు, ఉత్తర తెలంగాణ కార్యదర్శి భరత్ (దేవన్న) (జార్జి) సహా అమరుల 26వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క జెండాను ఆవిష్కరించారు. భరతన్న విగ్రహ స్థలం కు శంకుస్థాపన చేసిన అనంతరం చెట్లు నాటారు , విమలక్క మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, శాస్త్రీయ సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు

## బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలోని శబరిమాత ఆలయంలో అభివృద్ధి పనులకు డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారి భూమిపూజ



సికే న్యూస్ :బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో గత 20 సంవత్సరాలుగా భక్తుల ఆరాధన కేంద్రంగా కొనసాగుతున్న శ్రీ శబరిమాత ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నెల రోజులపాటు నిర్వహించనున్న అఖండ జ్యోతి మహోత్సవానికి భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించనున్నారు.

శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారికి ఆలయ కమిటీ మెంబర్స్ గ్రామ ప్రజలు బోథ్ మండల కాంగ్రెస్ శ్రేణులు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

శబరి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

అనంతరం డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ గారు ఆలయ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. శబరిమాత ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఐక్యత, సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

శ్రావణమాసంలో నిర్వహించనున్న అఖండ జ్యోతి కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని, అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో ఏ ఏమ్ సి చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ గారు,
ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ గారు,సర్పంచుల సంఘం అధ్యక్షులు అసిఫ్ ఖాన్,అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ రెడ్డి,రాష్ట్రకాంగ్రెస్ పార్టీూజ సెల్ ఉపాధ్యక్షులు మహేందర్ మండల కన్వీనర్ లు బోజన్న, గాజుల
పోతన్న, ఏలేటి రాజశేఖర్ గారు, ఆత్మ డైరెక్టర్ గడ్డల నారాయణ గారు, శబరి మాత కమిటీ సభ్యులు భోజన్న గారు, కనుగుట్ట సర్పంచ్ శ్రీమతి ఆకుల అనిత రాజేందర్ గారు,దౌలత్ రావు, మాజీ సర్పంచ్ మల్లేష్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,మార్కెట్ కమిటీ సభ్యులు జంగాల బోజన్న, మునశ్వర్ సోమన్న, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్ధం పోత రెడ్డి, అనీష్ ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు అరుణ్, పన్నాల శమేందర్ రెడ్డి, ఉమేష్, అబ్రార్, మహమ్మద్ అబుబు,సాయన్న అచ్యుతానందరెడ్డి,బీమాబుచన్న,రవి,రహంతుల్లా, శంషు,వార్డు సభ్యులు షేక్ షాకీర్, శబరిమాత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డిసిసి కార్యాలయం ఆదిలాబాద్

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్



సికే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జూలై 19 2026: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లచ్చగూడెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి వెంకటేశ్వరరావును బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ప్రమాదంలో ఆయనకు తగిలిన గాయాల గురించి, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని యథావిధిగా ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎదురైన పరిస్థితుల గురించి తెలుసుకుని, ఎలాంటి ఆందోళన చెందకుండా వైద్యుల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అవసరమైతే తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వెంకటేశ్వరరావు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆయన ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

## గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం ఆలయ పునరుద్ధరణ పూర్తి చేయాలి.



మంత్రి పొంగులేటి.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 19,వచ్చే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు 15 రోజుల ముందే అన్ని పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ఆదివారం ఆలయాన్ని సందర్శించిన మంత్రి స్వామివారిని దర్శించుకుని, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి, ప్రతి 10 రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.

ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.351 కోట్లు, భూసేకరణకు రూ.75 కోట్లు వెచ్చించిందని తెలిపారు. ఆగమశాస్త్రాలకు అనుగుణంగా, ప్రాచీన వైభవానికి భంగం కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత వంటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

గోదావరి పుష్కరాల దృష్ట్యా కొత్త స్నాన ఘాట్లు, యాత్రికుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాలని, అవసరమైతే అదనంగా 25 శాతం కార్మికులను నియమించి పనులను గడువులో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక సరఫరా, ఇతర అనుమతులను సకాలంలో అందజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆర్కిటెక్ మూర్తి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

**అటవీ--రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.**

**మంత్రి పొంగులేటి**



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూలై 19: జిల్లాలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీ-సర్వే పనుల్లో జాప్యం, నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

ఆదివారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూముల రీ-సర్వే పురోగతి, అటవీ--రెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో 70 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టగా ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని, ఐదు గ్రామాల్లో పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పాల్వంచలో సర్వే పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, జాప్యానికి కారణాలను వెంటనే తొలగించాలని సూచించారు.

రీ-సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు సర్వేయర్లు, రోవర్ పరికరాలు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అటవీ-- రెవెన్యూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కార చర్యలు చేపట్టాలని, ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.

కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గతంలో పోడు సాగు చేసిన వారి సమస్యలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పాల్వంచ శ్రీనివాసగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి ఆదేశించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రీ-సర్వే పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లో కూడా గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటిడిఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బర్తడే వేడుకల్లో గిరిజన నాయకులు- గిరిజన నాయకులు నీలాహేమ్లా నాయక్



గరేదేపల్లి సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామానికి చెందిన బానోతు సతీష్ తిరుపతమ్మ ల దంపతుల ఏకైక కుమారుడు సాయి లోహిత్ జన్మదిన వేడుకల్లో గిరిజన నాయకులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేకంగా ఆశీర్వదించారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులు తో విందు కార్యక్రమంలో పాల్గొని ఆనందింప చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు నాయక్ బాలు నాయక్ పులియ నాయక్ గిరిజన నాయకులు గుగులోతు సందీప్ నాయక్ కొట్టులకుపతి నాయక్ సామాజిక సేవాకర్త నరేందర్ నాయక్ ఒంటెద్దు అచ్యుత్ రెడ్డి సుక్కో నాయక్ బచ్చలకూరి కోటయ్య పాల రవీందర్ నెహ్రూ నాయక్ వీరబాబు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## హతీరాం బాపూజీ 597వ జయంతి వేడుకలు

- సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు -- మహా భోగ్ బండారో నిర్వహణ
- పెద్దఎత్తున తరలివచ్చిన బంజారా భక్తులు -- ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలు



సీ కే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జూలై 19 2026: ఏన్కూరు మండలం మూలపోచారం గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ తండాలో ఉన్న బూడియా బాపు దేవస్థానంలో శ్రీ శ్రీ హతీరాం మహారాజ్ (హతీరాం బాపూజీ) 597వ జయంతి వేడుకలను ఆదివారం సేవాలాల్ సేన, సేవాలాల్ ధర్మజాగరణ సేన ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించి, వేలాదిమంది భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకుని హతీరాం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం పంపిణీ చేసి, మహా భోగ్ బండారోలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

ఈ సందర్భంగా ఫిజియోథెరపీ వైద్యుడు భాదవత్ రవి మాట్లాడుతూ, శ్రీ శ్రీ హతీరాం బాపూజీ చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సమాజ సేవే నిజమైన దైవసేవ అనే సందేశాన్ని బాపూజీ తన జీవితంతో చాటిచెప్పారని పేర్కొన్నారు. యువత ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్ మాట్లాడుతూ, హతీరాం బాపూజీ బోధించిన సేవా తత్వం, ఆధ్యాత్మిక మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. బంజారా సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.

బంజారా సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. హతీరాం బాపూజీ జయంతి సందర్భంగా నిర్వహించిన మహా భోగ్ బండారో కార్యక్రమం భక్తులందరినీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు.

పరిసర గ్రామాల నుంచి బంజారా కుటుంబాలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్దఎత్తున తరలివచ్చి హతీరాం బాపూజీకి ఘనంగా నివాళులర్పించారు. భజన కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో సేవాలాల్ ధర్మజాగరణ సేన ఏన్కూరు మండల అధ్యక్షుడు అమృతరాజు సాదు, సేవాలాల్ సేన కన్వీనర్లు ఇస్లావత్ చందు నాయక్, భూక్యా వినోద్ నాయక్, సేవాలాల్ సేన ఏన్కూరు మండల అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, ఉపాధ్యక్షుడు సునీల్ నాయక్, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, మూలపోచారం సర్పంచ్ లలిత, టియల్ పేట సర్పంచ్ ప్రవీణ్ నాయక్, కేఆర్ పురం సర్పంచ్ నరసింహరావు,రాంనగర్ తండా నాయకులు శ్రీను నాయక్, హరి సింగ్ నాయక్, చందర్‌జీ, భజన్‌లాల్, రఘు, శంకర్, బాలకృష్ణ నాయక్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, విద్యార్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. హతీరాం బాపూజీ ఆశీస్సులతో సమాజంలో సేవాభావం, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు.

# గిరిజన చట్టాలకు తూట్లు.. విద్యానగర్‌లో అక్రమ సెల్లర్ నిర్మాణం!





- బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు.
- ప్రజలకు తీవ్ర ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు.
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి.
- కలెక్టర్, డీపీఓ జోక్యం చేసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 19,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ బఫర్ జోన్‌లో అక్రమ సెల్లర్ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 51/4, ఇంటి నంబర్ 3-1-236/4 వద్ద డీటీసీపీ అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనానికి సెల్లర్ నిర్మాణం చేపట్టారని పేర్కొంటున్నారు. గిరిజనేతరులు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలతో నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గత రెండు నెలలుగా పలు దినపత్రికల్లో వార్తలు ప్రచురితమైనప్పటికీ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయని, అధికారులు మాత్రం నోటీసులు జారీ చేశామని చెప్పడం తప్ప తదుపరి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నోటీసు అందుకున్న తర్వాత ఏడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అమలు కావడం లేదని అంటున్నారు. అక్రమ నిర్మాణ పనుల కారణంగా రోడ్లపై బురద పేరుకుపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలను రోడ్డుపై నిలిపివేయడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఈ వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణ ప్రాంతానికి సమీపంలో ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే బ్యాంకు ఉన్నప్పటికీ భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమీప స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ అంశంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) స్వయంగా స్పందించి విచారణ జరిపి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, గిరిజన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని విద్యానగర్ ప్రజలు కోరుతున్నారు. అలాగే గిరిజన నాయకులు కూడా స్పందించి చట్ట విరుద్ధ నిర్మాణాలపై చర్యలు తీసుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే కోరం కనకయ్య.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 19,** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను తెలంగాణ శాసనసభ అంచనాల కమిటీ ( ఎస్టిమేట్స్ కమిటీ ) ఛైర్మన్‌గా నియమించారు. 2026--27 సంవత్సరానికి సంబంధించిన శాసనసభ కమిటీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించగా, అంచనాల కమిటీకి కనకయ్యను ఛైర్మన్‌గా నియమించారు. ప్రభుత్వ శాఖల వ్యయ అంచనాలను పరిశీలించడం, నిధుల వినియోగాన్ని సమీక్షించడం, ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించేలా ప్రభుత్వానికి సూచనలు చేయడం అంచనాల కమిటీ ప్రధాన బాధ్యతలు. ఈ కమిటీ ఛైర్మన్‌గా కోరం కనకయ్య నియామకం జిల్లాకు గౌరవకరమైన విషయమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.ద

# ధర్మసాగర్ లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రెస్ మీట్



**సీకే న్యూస్ జూలై 19 ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** స్థానిక ధర్మసాగర్ బి ఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డు ప్రతాప్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం బెల్లం ప్రేమ్ నివాసంలో ఏర్పాటు చేయడమైనది. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హాజరైనారు, మాజీ ఎమ్మెల్యే రాజయ్య బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం, పెద్ద పెండ్యాల, నర్సింగరావు పల్లి, ఎల్కుర్తి, ధర్మసాగర్ కేంద్రాల్లో ఉన్న ప్రత్యేక ఎస్ ఐ ఆర్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, బి ఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడమైనది, ఓటు హక్కును ఓటర్లు ఎలా పూర్తి చేయాలి, చేసినటువంటి మీ వద్దనున్న ఎస్ ఐ ఆర్ రెండు ఫాములలో ఓటర్ ఫోటో పెట్టి మీ మీ గ్రామంలోని బి,ఎల్,ఓ గారి సంతకం తీసుకొని ఒక ఫామ్ మీ వద్ద ఉంచుకొని, మరొక ఫామ్ బి,ఎల్,ఓ కు అప్పగించి వారితో పూర్తి సమాచారం తీసుకోవాలి ,అంతేకాకుండా మీ గ్రామంలోని మీరు ఉన్న ఇంటికి ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు మీ ఇంటి వద్ద ఓటర్ లేక పోతే ఇట్టి విషయమును ఇతరుల ద్వారా తెలుసుకొని మీ ఎస్ ఐ ఆర్ ఫామును పూర్తి చేసి వారికి ఇవ్వాలి, ఈ ఎస్ ఐ ఆర్ ఫామ్ను మనం అప్లై చేయకపోతే ఓటర్లకే నష్టం, ఓటర్లకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా, వాటిని పక్కనపెట్టి ఈ ఓటర్ నమోనా ఫార్మ్ ను సద్వినియోగం చేసుకోగలరు.

తదనంతరం బి ఆర్ఎస్ పార్టీ పేరుతో స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసలు నీది ఏ పార్టీ అంటే సమాధానం చెప్పడు, నేను నిజాయితీపరున్ని, నేను నీతిమంతుని అంటాడు, తనంత మోసగాడు ఈ దేశంలో ఏ రాజకీయ వ్యక్తి లేడు ,,కన్నతల్లి లాంటి బిఆర్ఎస్ పార్టీలో ఉపముఖ్యమంత్రి పదవి పొంది,ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ఉన్నతమైన పదవులను పొంది బిఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కడియం శ్రీహరి,,దేవాదుల ప్రాజెక్టు నేను పునాది వేసిన అని గొప్పలు చెప్పుకుంటూ డబ్బలు కొట్టుకుంటున్నారు.నేను ఇట్టి మొక్కను నాటాను, అది ఇప్పుడు వటావృక్షమైనది అంటున్నావ్, ఇటువంటి మాటలు నీవు చెప్పుకోవడం సిగ్గుచేటు, ఎవరైనా ఇతరులకు సహాయం చేస్తే సహాయం చేసిన వారు చెప్పుకోరు, నీవు 20 సంవత్సరములు ఎమ్మెల్యేగా లేనేలేవు, నేను 2009,2013,2018,2023 వరకు స్టేషన్గన్పూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు నేనే చేశాను తప్ప నీవు చేసినది ఏమి లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# అధికసంఖ్యలో పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 19,** శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించినారు. దేవాలయ ఆవరణలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారికి అభిషేకములు నిర్వహించారు. అన్నప్రాశనలు, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదములను స్వీకరించారు. ములకలపల్లి యస్ఐ ఐ మధుసూదన్ మరియు శ్రేయాస్ మీడియా చైర్మన్ గంద్ర శ్రీనివాసరావు, రమా, సంపత్, రమేష్ రాథోడ్, నరాటి ప్రసాద్, శేఖర్, రచ్చ శ్రీను, సతీష్, రవి, బాలకృష్ణ , చిరంజీవి గార్లు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిమిత్తం రూ.32000/- విరాళం సమర్పించారు .మరియు భక్తుల కనువిప్పుకై కుమారి వి. నాగసింధు, హైదరాబాద్ వారిచే "శ్రీ శ్రీనివాసా కళ్యాణం "హరికథా కాలక్షేపం నిర్వహించబడినది. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి విజయ కుమార్, సిబ్బంది పర్యవేక్షించినారు.

## నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి గారి చేతుల మీదుగా 2,24,000 జవీ=ఖీ చెక్కుల పంపిణీ.

**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్ :** మెదక్ జిల్లాకొల్చారం మండలానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారి కృషి 2 లక్షల 24 వేల రూపాయల విలువ గల జవీ=ఖీ చెక్కులు మంజూరు కావడం అయ్యాయని

ఒక ప్రకటనలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ తెలిపారు.

ఇట్టి చెక్కులను నేరుగా సోమవారం రోజున నర్సాపూర్లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి గారి చేతులమీదుగా అందించడం జరుగుతుందని తెలపడం జరిగింది సంబంధిత గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సర్పంచులు లబ్ధిదారులు నేరుగా నర్సాపూర్లో గల సాయి కృష్ణ గార్డెన్ కి ఉదయం 11 గంటల వరకు తీసుకు రావాల్సిందిగా ఆయన తెలపడం జరిగింది.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మూడవత్ రాంబల్ నాయక్




- జేఏసీకి ముఖ్య సలహాదారుగా రాజా వరప్రసాద్, సలహాదారుగా అబ్దుల్ రబ్ జామీని ఎంపిక
- కన్వీనర్లుగా ఎంఎస్ సత్యనారాయణ (బీఆర్ఎస్), దొడ్డి శ్రీనివాస్ (బీఎస్పీ), టంగుటూరి నరసింహారెడ్డి (సీపీఐ), ఈశ్వర్ నాయక్ (సీపీఎం), బిక్షపతి (డీఎస్పీ), మోహన్ సింగ్ (బీజేపీ)
- కోఆర్డినేటర్లుగా పినపాక ప్రభాకర్ తదితరులు
- సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటానికి జేఏసీ ఏర్పాటు
- జీవో 641 రద్దు వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఏకగ్రీవ తీర్మానం

**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జూలై 19 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని మా కన్వెన్షన్ హాల్‌లో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఐదు గంటలకు పైగా సాగిన సుదీర్ఘ సమావేశంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జేఏసీకి ముఖ్య సలహాదారుగా రాజా వరప్రసాద్, సలహాదారుగా అబ్దుల్ రబ్ జామీని ఎంపిక చేశారు. కోఆర్డినేటర్లుగా తిరుమలయ్య (పౌర హక్కుల సంఘం), పినపాక ప్రభాకర్‌ను నియమించారు.

జేఏసీ చైర్మన్‌గా మూడవత్ రాంబల్ నాయక్ ఎన్నిక కాగా, కన్వీనర్లుగా ఎంఎస్ సత్యనారాయణ (బీఆర్ఎస్), దొడ్డి శ్రీనివాస్ (బీఎస్పీ), టంగుటూరి నరసింహారెడ్డి (సీపీఐ), ఈశ్వర్ నాయక్ (సీపీఎం), బిక్షపతి (డీఎస్పీ), మోహన్ సింగ్ (బీజేపీ), వడ్డే బాలయ్య, బొజ్జ శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకున్నారు. కో-చైర్మన్లుగా అర్జునప్ప (టీపీఎఫ్), పెంటనుల్ల నరసింహ మాదిగ (ఎంఆర్పీఎస్), బిచ్చా నాయక్ (ఎల్‌హెచ్‌పీఎస్), వరప్రసాద్ (బీసీ సేన), శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ), ఆకాష్ (ఏఎస్ఎఫ్ఐ), రవీంద్రనాథ్ (పీఏవీ), రామ్‌చందర్ (పీకేఎం), పీజీ శ్రీనివాస్ (టీయూజేఏసీ), సత్యనారాయణ (పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ), బత్తుల జంగయ్య (వ్యవసాయ కార్మిక సంఘం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈకో పార్క్ పేరుతో సిద్దాపూర్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు జారీ చేసిన జీవో నెం.641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 641 రద్దు అయ్యే వరకు జేఏసీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని నిరంతర ఉద్యమాన్ని కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

## 10 రోజుల పాటు 'హx=' కార్యక్రమంపైనే దృష్టి సారించాలి:

- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ పిలుపు
- బరంపూర్ గ్రామంలో ఘనంగా 'హx=' సమీక్షా సమావేశంఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- పార్టీ నాయకులు, కార్యకర్తలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ దిశానిర్దేశం

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, ఇందుకోసం రాబోయే 10 రోజుల పాటు అన్ని పనులను పక్కనపెట్టి పూర్తిగా 'హx=' (సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమంపైనే దృష్టి సారించాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో 'హx=' సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ హx= కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఆదిలాబాద్ నియోజకవర్గ అబ్జర్వర్, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, బోథ్ నియోజకవర్గ అబ్జర్వర్ రమేష్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ అడ్డి బోజ రెడ్డి, మాజీ ుఎుఎ అధ్యక్షులు సాజిద్ ఖాన్,తలమాడుగు మాజీ జడ్పీటీసీ గోకా గణేష్ రెడ్డి తో కలిసి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ప్రతి ఓటూ సురక్షితంగా ఉండాలి**

ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గడువులోపు అవసరమైన ఫారాలను సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం**


ఈ 10 రోజుల పాటు ప్రతి కార్యకర్త అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆడే గజేందర్ సూచించారు. తమ ఓటుతో పాటు పార్టీ మద్దతుదారుల ఓట్లు,ప్రజల ఓట్లు కూడా సురక్షితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాం), సూపర్‌వైజర్లు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టం చేశారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (హx=) ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. మీ పూర్తి వివరాలను అందించి ఓటరు జాబితాలో మీ పేరు సరిగ్గా ఉందో లేదో సరిచూసుకోవాలి" అని ఆడే గజేందర్ ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, మండల అధ్యక్షులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు బరంపూర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 19,** ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా ఇల్లందు మండలం రొంపేడు గ్రామంలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసి, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, రాష్ట్రవ్యాప్తంగా 165 పవర్ అంబులెన్స్‌ల ద్వారా విద్యుత్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగరేణి అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ కొత్త ఉప కేంద్రాలతో విద్యుత్ సరఫరా మరింత బలోపేతమై వినియోగదారులకు మెరుగైన సేవలు అందనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్యే రామదాస్ నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులపై దాడిని ఖండించిన జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 19:** ఫారెస్ట్ అధికారులపై ఇటీవల జరిగిన దాడిని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, మణుగూరు యూనిట్ తీవ్రంగా ఖండించింది. యూనిట్ అధ్యక్షుడు వి. గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. మనుబోతులపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో కొందరు గోత్తికోయలు గుంపుగా వచ్చి ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు జేసీబీ పనులను అడ్డుకోవడం, అధికారులతో వాగ్వాదానికి దిగడం, భౌతిక దాడులకు పాల్పడడం అత్యంత ఖండనీయమని సమావేశంలో పేర్కొన్నారు.

అనంతరం ఫారెస్ట్ అధికారులపైనే తప్పుడు ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం చేయడం, సోషల్ మీడియా సహా ఇతర మాధ్యమాల్లో అధికారులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించడం బాధాకరమని, ఇటువంటి చర్యలు ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అటవీ అధికారుల భద్రతకు భంగం కలిగించే వారిపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తప్పుడు ప్రచారం చేసి అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, మణుగూరు యూనిట్ ప్రభుత్వాన్ని కోరింది.

ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు వి. గోవింద్, ఉపాధ్యక్షుడు పద్దం ఎర్రయ్య, సభ్యుడు బి. భీమ్‌చంద్, ఖజాంచి జి. బాబురావు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర కాలపు కల.. సాకారమైన వేళ..

- షాద్ నగర్ లో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ..
- జేపీసీ వినతితో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో నిర్మాణం..
- ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..
- ఎమ్మెల్యే వీర్లపల్లికి ఉద్యమకారుల కృతజ్ఞతలు



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జూలై 19 :** తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడి చివరికి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి అమరవీరుల కోసం ఒక స్తూపం ఏర్పాటు పుష్కర కాలంగా కలగానే మిగిలింది. ఉద్యమాల ఐకాసా నాయకులు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చివరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఆ ప్రయత్నం సఫలం అయింది. పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన అమరవీరుల స్తూపాన్ని ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జయ జయ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కూడా ఈ కార్యక్రమానికి హాజరై అమరవీరులకు నివాళులు అర్పించడం విశేషం. ఐకాసా నాయకులు జనార్దన్, పినపాక ప్రభాకర్, కరుణాకర్, టీజీ శ్రీనివాస్, గిరిధర్, కృష్ణయ్య, వంగూరి గంగిరెడ్డి, వి. రామారావు, సరాపు జగదీశ్వర్ తొలితరం ఉద్యమకారుడు నాగిళ్ళ గోపాలగుప్త, బిజెపి నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి, మంగులాల్ నాయక్, కలంకార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# ఇల్లందలో యాదవ సంఘానికి నూతన కమిటీ

- అధ్యక్షుడిగా ఆబర్ల మల్లేశ్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



**పాలకుర్తి/వర్ధన్నపేట,(సి కే న్యూస్)** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో యాదవ కుల పెద్దల సమక్షంలో యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఆబర్ల మల్లేశ్ యాదవ్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా బొంతల రాజ్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కన్నబోయిన సదానందం యాదవ్, కోశాధికారిగా భాషబోయిన ప్రవీణ్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు.కార్యవర్గ సభ్యులుగా మానుక గణేష్ యాదవ్, నీలం రాజు యాదవ్, బొంతల సంతోష్ యాదవ్, బొంతల రాజు యాదవ్, ఆబర్ల రాజు యాదవ్లను ఎంపిక చేశారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం సభ్యులు, గ్రామ యాదవ కుల పెద్దలు కలిసి ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎద్దు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎద్దు సత్యనారాయణ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేసి, యాదవ సంఘం ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలోని యాదవుల సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం సంఘం చురుకుగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం సభ్యులు, కుల పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమరవీరుల ఆశయాలు నెరవేరినప్పుడే నిజమైన నివాళి

- ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖల మంత్రి మంత్రి జూపల్లి
- షాద్ నగర్ నియోజకవర్గంలో నలుగురు అమరవీరుల కుటుంబాలకు రూ 4 లక్షల సాయం
- అమరుల స్తూపమే సాక్ష్యం - ఎమ్మెల్సీ కోదండరాం
- ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాలు కేటాయిస్తాం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మరుగున పడిన అసలైన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలి: వెన్నెల గద్దర్
- "నా బిడ్డ త్యాగం వృథా కాలేదు".. భావోద్వేగానికి గురైన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ
- ఉద్యమకారులకు న్యాయం చేసే ప్రభుత్వం ఇదే - మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి
- ఆత్మహత్యలు కాదు.. పోరాటమే పరిష్కారం బిజెపి నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
- అమరవీరుల స్తూపం ఆశయాలకు మార్గదర్శకం - వంగూరి గంగిరెడ్డి
- శంకరన్నకే ఈ గౌరవం దక్కుతుంది - ఉద్యమకారుడు ప్రభాకర్
- ఉద్యమకారులకు భారీగా సన్మానాలు



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి జూలై 19 :** తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలు పూర్తిగా సాకారమైనప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరులు పవిత్రమైన త్యాగం చేశారని, వారు సాధించాలనుకున్న లక్ష్యాలను పాలకులుగా మనం అమలు చేసినప్పుడే వారి త్యాగాలకు అర్థం ఉంటుందని మంత్రి అన్నారు. శ్రీకాంతాచారి ఆత్మాహుతి తర్వాత తెలంగాణ ఉద్యమం మరింత ఉధృతమై జాతీయ స్థాయికి చేరుకుందని గుర్తు చేశారు. ప్రపంచం మెచ్చిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని పాలనలోనూ ప్రతిబింబించేలా ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ కోసం పెట్టుకున్న ఆశయాలు నెరవేరే వరకు ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని మరువకూడదని పిలుపునిచ్చారు. అదేవిధంగా షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమానికి బలైన నాలుగు కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున 4 లక్షల రూపాయలు ప్రభుత్వం ద్వారా అందజేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఉద్యమకారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శంకర్ లు ఘనంగా సన్మానించారు.

**అమరుల స్తూపమే సాక్ష్యం - ఎమ్మెల్సీ కోదండరాం**

తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరిస్తున్నారని చరిత్ర పై నిందారోపణలు చేస్తున్నారని ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనైతికంగా జరిగిందంటూ కొందరు అంటున్నారని అలాంటివారు అమరవీరుల స్థూపాన్ని చూడాలన్నారు. స్థూపమే 1200 మంది బలిదానాలకు సాక్ష్యం అన్నారు. తెలంగాణ పోరాటం పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థూపాన్ని ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఎంతో గుర్తించాలని త్వరలోనే ఉద్యమకారులకు కూడా ప్రభుత్వ నుండి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు.

**ఉద్యమకారులకు 20 ఎకరాల ఇళ్ల స్థలాలు: ఎమ్మెల్యే శంకర్**

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గత పాలకులు ఉద్యమకారులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గద్దర్ వంటి మహనీయులను అవమానించారని, అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను కూడా పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా ఉద్యమకారుల సంక్షేమంపై సరైన దృష్టి పెట్టలేదని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గౌరవిస్తూ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని నిజమైన ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు 20 ఎకరాల భూమిని త్వరలో కేటాయించనున్నట్లు సభ వేదికగా ప్రకటించారు. ఉద్యమకారులు ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులు సాధించుకోవాలని సూచించారు.

**మరుగున పడిన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలి: వెన్నెల గద్దర్**

రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు గుర్తింపు లేక మరుగున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ చరిత్రను మనమే లిఖించుకోవాలని, తెలంగాణ ఉద్యమంపై సమగ్ర గ్రంథం వెలువడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

అడవుల నుంచి సమాజంలోకి వస్తున్న కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. గద్దర్ చూపిన ఆశయాల మార్గంలో తాను కూడా పనిచేస్తానని తెలిపారు.

**"నా బిడ్డ త్యాగం వృథా కాలేదు" -- శంకరమ్మ భావోద్వేగం**

మహిళా కమిషన్ సభ్యురాలు, అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ సభలో భావోద్వేగంగా మాట్లాడారు. తన కుమారుడు ప్రాణత్యాగం చేస్తూ "జై తెలంగాణ" నినాదం చేశాడని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలిచే నాయకులు ప్రతి ఊర్లో ఉండాలని ఆమె కోరారు. తన కుమారుడి త్యాగం వృథా కాలేదని, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు.

**ఉద్యమకారులకు గుర్తింపు రావాలి: ప్రతాప్ రెడ్డి**

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. తెలంగాణ కోసం తాను 17 సార్లు ఢిల్లీకి వెళ్లి పోరాడానని గుర్తు చేశారు. అమరవీరులు కలలుగన్న నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

**ఆత్మహత్యలు కాదు.. పోరాటమే మార్గం: శ్రీవర్ధన్ రెడ్డి**

బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పాలమూరు బిడ్డల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల సేవలను గుర్తు చేస్తూ, సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ఆత్మహత్యలు ఎప్పటికీ శరణ్యం కాదని సూచించారు.

**స్తూపం కాదు.. ఆశయాల దీపం: వంగూరి గంగిరెడ్డి**

కవి, రచయిత వంగూరి గంగిరెడ్డి మాట్లాడుతూ, షాద్‌నగర్‌లో నిర్మించిన అమరవీరుల స్తూపం కేవలం నిర్మాణం కాదని, అది తెలంగాణ ఆశయాలను తరతరాలకు చాటే ఒక దీపమని అన్నారు. ఉద్యమకారులను గౌరవిస్తూ ఎమ్మెల్యే శంకర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.

**శంకరన్నకే ఈ గౌరవం దక్కుతుంది: ఉద్యమకారుడు ప్రభాకర్**

ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ కోదండరాం విగ్రహంతో పాటు అమరవీరుల స్తూపం నిర్మించిన ఘనత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కే దక్కుతుందని అన్నారు. గద్దర్ తదితర మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కూడా ప్రశంసనీయమని తెలిపారు.

సభ ప్రారంభంలో తెలంగాణ అమరవీరులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. టీజేఏసీ నాయకులు మూలే జనార్ధన్, కరుణాకర్ నిర్వాహకులుగా వ్యవహరించగా, నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు..

# డిప్యూటీ సీఎం ఇలాకాలో కనీస వసతులకు నోచుకోని సంక్షేమ హాస్టళ్లు

- నాగులవంచ ఎస్సీ హాస్టల్ లో సమస్యలపై కెవిపిఎస్ సర్వే
- సర్వేలో పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క యొక్క ఎస్సీ నియోజకవర్గంలోనీ సంక్షేమ వసతి గృహాలలో కనీస వసతులకు కూడా నోచుకోకుండా విద్యార్థుల తీవ్ర అవస్థలు పడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నాగులవంచ ఎస్సి హాస్టల్ ని సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వే అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్లో కనీస వసతులైన కిటికీలు, బాత్రూములు, కరెంటు, తాగునీరు తదితర మౌళిక వసతులకు నోచుకోకుండా విద్యార్థులు అవస్థలు గురవుతున్నారని, సరిపడా మెస్ చార్జీలు లేక నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థులు వాపోయారు. బాత్ రూమ్ లకు తలుపులు, కిటికీలకు అద్దాలు, దోమ జాలీలు కూడా పెట్టలేని దుస్థితి నెలకొన్నదని, హాస్టల్లో కనీస మరమ్మతులకు ఎన్నో ఏళ్లుగా నిధులు ఇవ్వకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షం వస్తే మురికి కుంటలుగా తయారై దోమలకు నిలయాలుగా మారి డెంగ్యూ మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని తక్షణమే మరమ్మతుల కొరకు నిధులను విడుదల చేసి కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాలలు తెరిచి నెలలు కావస్తున్న నోట్



బుక్స్ అందజేయడంలో నిర్లక్ష్యం, యూనిఫారం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల గోడును ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని ఆయన అన్నారు. విద్యార్థుల నాణ్యమైన విద్య కొరకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టల్లోనీ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా సర్వేలు, ఆందోళనలు నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. హాస్టల్ సమస్యలను పరిష్కరించకపోతే రానున్న కాలంలో దశల వారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా కోట వీరస్వామి నియమాకం



**సూర్యాపేట జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్షులు కోటవీరస్వామి

హైదరాబాద్ అమర జ్యోతి పరంగణంలో లో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న చైర్మన్ వెంకటాచారి నగరికంటి కిరణ్ కలిసి సూర్యాపేట జిల్లా తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్షులుగా కోటవిరస్వామి నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ

తెలంగాణ ఉద్యమంలో దగా పడ్డటువంటి కళాకారులందరిని ఏకం చేస్తూ తెలంగాణ ఉద్యమంలో నిష్పక్షపాతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నిరుద్యోగ కళాకారుల కు ఉద్యోగం వచ్చేదాకా ఉద్యమిస్తానని, దగాపడ్డ కళాకారులందరినివేకం చేస్తూ తెలంగాణ సారధిలోఉద్యోగాల సాధనకై ధనవంతు కళాకారులను కలుపుకొని కృషి చేస్తానని మాట్లాడారు, నాపై నమ్మిక ఉంచి ఈ పదవిని నాకు ఇచ్చినటువంటి రాష్ట్ర కమిటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా ఉద్యమ కళాకారులు,పేరాల యాదగిరి జీవాది ప్రవీణ్ కుమార్,కొండ్రు కుమార్ నగర కంటి చిరంజీవి,పొడపంగు దేవయ్య, పందిరి సైదులు,కంజర శీను డాక్టర్ సలీం పాల్గొన్నారు

## దొంగను పట్టుకున్న పోలీసు బృందం




**సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్:**మెదక్ జిల్లాకొల్చారం మండల పరిధిలోని నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన ఫిర్యాదారులకు నాయిని రాయన్న తండ్రి కిష్టయ్య వయసు 62 సంవత్సరాలు కులం మున్నూరు కాపు వృత్తి వ్యవసాయం గారి ఇంట్లో తేదీ 06.07.2026 గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం మొదలుపెట్టి దొంగతనం చేసినారని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు పరిచయం అయినది ఇట్టి దొంగతనం విషయంలో ఈరోజు తేదీ 19.07.2026 నాడు ఏడుపాయల ౹ జంక్షన్ వద్ద కొల్చారం పోలీస్ వారు ఎస్ఐ గారి ఆధ్వర్యంలో వెహికల్ చెకింగ్ చేయుచుండగా నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన దుబ్బగళ్ల అలియాస్ నిరుడి కృష్ణ తండ్రి రాములు వయస్సు 43 సంవత్సరంలో కులం ఎస్సీ మాల వృత్తి కూలి పని అను వ్యక్తి ప్యాసింజర్ ఆటోలో మెదక్ వైపు వెళుతుండగా అట్టి ఆటోను ఆపి విచారించగా అట్టి వ్యక్తి సమాధానము చెప్పనందున కొల్చారం పోలీస్ స్టేషన్కు తీసుకొని వచ్చి తగు విచారణ చేయగా అట్టి వ్యక్తి నాని జలాల్పూర్ గ్రామానికి చెందిన నాయిని రాయన్న గారి ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు అట్టి వ్యక్తి నుండి అర్ధ తులం బంగారం ఉంగరం మరియు 51 వేల నగదు రూపాయలు స్వాధీనపరచుకొని అట్టి వ్యక్తి నీ రిమాండ్ నిమిత్తం జే ఎఫ్ సి ఎం మెదక్కోటుకు పంపనైనది

## మిత్రుడి జ్ఞాపకార్థం గ్రంథాలయంలో పుస్తకాల అందజేత.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 19.**వలిగొండ మండల గ్రంథాలయ మాజీ చైర్మన్ కీర్తిశేషులు పల్లెర్ల ప్రకాష్ జ్ఞాపకార్థం ఆయన మిత్రబృందం ఆదివారం గ్రంథాలయానికి 5000 రూపాయల విలువైన పుస్తకాలు అందజేశారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ గా పల్లెర్ల ప్రకాష్ నాడు గ్రంథాలయ అభివృద్ధికి అందించిన విశేష సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ప్రెసిడెంట్ ఆదిమూలం సోమేష్ మాట్లాడుతూ... గ్రంథాలయ అభివృద్ధికి గ్రామంలోని విద్యావంతులు, మేధావులు సహకారం అందించాలని కోరారు. మోటే శ్రీనివాస్, మారగోని ఉపేందర్, స్థానిక తొమ్మిదో వార్డు సభ్యులు కౌడె కృష్ణ మౌనిక, ఎమ్మె వెంకటేష్, మారగోని విష్ణు, మైసోల్ల మచ్చగిరి, గొల్ల కిరణ్, జెరిపోతుల సురేష్, దయ్యాల వీరస్వామి, బత్తిని వరుణ్, బత్తని శేఖర్, మైసోల్ల నరేష్, గర్దాసు మనోహర్, మునుకుంట్ల సందీప్, కీర్తి సంజు, అంతటి వినయ్ కుమార్, దయ్యాల సురేష్, మైసోల్ల సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పలువురు అచిర్వచనాలు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన మర్రి శ్రీనివాసరావు, మనోహర ల కూతురు మేఘన , భరత్ కుమార్ నూతన వస్త్రాలంకరణ, పంచకట్టు వేడుకలు నాగులవంచ వంకాయలపాటి రామయ్య పంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, దీ=ూ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ, సామినేని బాబురావు, కొల్లి బాబు,.ముప్పిడి వెంకటేశ్వర్లు , అంబటి వెంకటి, నాదెండ్ల వెంకటేష్, జూవీ నాయకులు వత్సవాయి జానకీరాములు, నంజాల మాధవరావు, బల్లి వీరయ్య, తోటకూరి వెంకటనరసయ్య,రౌతు అప్పారావు, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, సెల్ పాయింట్ మండేపూడి మదన్, జర్నలిస్ట్ నన్నక అప్పారావులు చిన్నారులను ఆశీర్వదించారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మత్కేపల్లి గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపతి..




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తలసేమియా బాధితుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని మత్కేపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి కంచం ద్రౌపతి , ఉప సర్పంచ్ పగడాల పుల్లమ్మ కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తలసేమియా బాధితులకు తరచూ రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడడంలో స్వచ్ఛంద రక్తదాతల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు నిర్భయంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.
మానవత్వానికి ప్రతీకగా నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో యువత, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరుడు ఏం చేసినా ప్రజా శ్రేయస్సు కోసమే.!

- “ఆదివాసీల చట్టాలకు తను ఒక యోధుడు.”
- “వీరయ్య పతనానికి పార్టీలో సొంత వ్యక్తులే కారణం అన్న ఆరోపణ ఎంతవరకు వాస్తవం.”
- “ఆయన మంచితనమే ఆయనను ముంచేసింది కార్యకర్తల ఆవేదన.”
- “మండల అధ్యక్షుడి పదవి విషయంలో పెద్దాయన మాట పెడచెవిన పెడుతున్న నూతన నాయకులు.”
- “అదే జరిగితే హస్తం పార్టీకి తీరని నష్టం, కారు పార్టీకి సువర్ణ అవకాశంగా మారనుందా.!”
- “ప్రస్తుత భద్రాచల నియోజకవర్గ ఎమ్మెల్యేకు పోదాం కార్లో ఎదురైతే జరిగే కథ ఏంటి.?”
- “ప్రతిపక్షంలో సభ్యత్వం ఉంది అంటూ అధికారికంగా కొనసాగుతున్న నాయకుడి గతి భవిష్యత్తులో ఏంటి.?”
- “ఒకవేళ వీరయ్య విషయంలో ఆరోపణ నిజమైతే ఆయన నాశనానికి కారణమైన ఆ మండల నాయకుల గతేంటి.?”
- “ప్రస్తుత పార్టీలో అశ్రద్ధ పెద్దాయనకి, ప్రతిపక్షంలో అవకాశాలుగా మారుతున్నాయా.?”




**“ములుగు జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి భార్గవ్.”**గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతూ, గిరిజన గూడాలకు వెలుగునిచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే పోడెం వీరయ్య పేరు మరోసారి భద్రాచలం నియోజకవర్గ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గిరిజన భూ హక్కులు, అటవీ హక్కులు, విద్య, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పోరాడిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు.
గత ఎన్నికల్లో పోడెం వీరయ్య ఓటమికి ప్రధాన కారణం ప్రత్యర్థుల కంటే సొంత పార్టీలోని కొందరు నాయకుల వైఖరేనని ఆయన అనుచరులు ఇప్పటికీ ఆరోపిస్తున్నారు. ఆయన మంచితనాన్ని, నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగిన కొందరు చివరికి ఎన్నికల సమయంలో సహకరించకుండా వెన్నుపోటు పొడిచారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం, కొందరు నాయకుల వ్యవహార శైలి కలిసి పోడెం వీరయ్య విజయావకాశాలను దెబ్బతీశాయని రాజకీయ వర్గాల్లో కూడా చర్చ జరుగుతోంది. అయితే ఈ విషయాలపై సంబంధిత నాయకులు బహిరంగంగా స్పందించిన సందర్భాలు లేవు.
ఇదిలా ఉండగా, గత ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా జరిగిన రాజకీయ పరిణామాలను పోడెం వీరయ్య పూర్తిగా అర్థం చేసుకున్నారని, సరైన రాజకీయ అవకాశాన్ని ఎదురుచూస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో వినిపిస్తోంది. ఒకవేళ ఆయన భవిష్యత్తులో పార్టీ మార్పు నిర్ణయం తీసుకుంటే భద్రాచలం రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..ప్రస్తుతం పోడెం వీరయ్య రాజకీయ అడుగుపై నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, రాజకీయ నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా అది భద్రాచలం రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది..అయితే, పోడెం వీరయ్య పార్టీ మార్పు లేదా భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ప్రస్తుతం వినిపిస్తున్న ప్రచారాలపై స్పష్టత రావాలంటే ఆయన అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే...

# సజవుగా సాగని ‘సర్’ ప్రక్రియ

- 2002 నిబంధన గుదిబండగా మారిందన్న సామాజికవేత్త దొనికెన కుమారస్వామి
- సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి.. ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శ



**పాలకుర్తి/తొర్రూరు,(సి కే న్యూస్ ):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ‘సర్’ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో పలు లోపాలు నెలకొన్నాయని, 2002 నిబంధన అమలు అధికార యంత్రాంగానికి గుదిబండగా మారిందని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి విమర్శించారు. తగిన ప్రణాళిక లేకుండా చేపట్టిన ఈ ప్రక్రియ కారణంగా అధికారులు, బీఎల్వోలు, సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దాని ప్రభావం పనితీరుపై పడుతోందని పేర్కొన్నారు. గత వారం రోజులుగా తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయంలో కొనసాగుతున్న ‘సర్’ శిబిరంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్యూమరేషన్ ఫారాల నింపడం, సందేహాల నివృత్తిలో స్వచ్ఛందంగా పాల్గొన్న ఆయన, గుర్తించిన సమస్యలను స్థానిక ఎమ్మార్వోకు లిఖితపూర్వకంగా వివరించినట్లు తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బూత్‌ల వారీగా ఫారాల పంపిణీ చేయకుండా, గత మున్సిపల్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల వారీగా బీఎల్వోల ద్వారా పంపిణీ చేయడం వల్ల గందరగోళం ఏర్పడిందన్నారు. బూత్‌ల వారీగా పంపిణీ చేసి ఉంటే బీఎల్ఏల సహకారంతో ప్రతి ఓటరికి సకాలంలో ఫారం చేరేదని అభిప్రాయపడ్డారు. 2002 నిబంధనపై ఫీల్డ్ సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో ఫారాల నింపడం, ధ్రువీకరణ, సమర్పణ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంటోందన్నారు. ఫారంలోని మొదటి, రెండో భాగాల్లోని వివరాలు నమోదు చేసే విషయంలో ఏకరీతి విధానం లేకపోవడంతో సిబ్బంది కూడా సందిగ్ధంలో పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవసరాల రీత్యా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు ప్రత్యేకంగా తమ స్వగ్రామాలకు వచ్చి వివరాలు సమర్పించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, వారికి సరైన మార్గనిర్దేశం చేసే వ్యవస్థ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనివల్ల అసలైన ఓటర్లే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 271వ బూత్ పరిధిలో ఒకే చోట పట్టణంలోని అన్ని వార్డుల ఫారాలతో పాటు ఇతర మండలాలకు చెందిన ఓటర్ల ఫారాలు కూడా కలిసిపోవడం వల్ల బీఎల్వోలు, అధికారులు పనులు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ‘సర్’ నిర్వహణలో ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నప్పటికీ, అర్హులైన ఓటర్ల ఓటు హక్కు కోల్పోకుండా ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం వెంటనే లోపాలను సరిదిద్దాలని దొనికెన కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. కేవలం గడువు పెంచడం వల్ల సమస్య పరిష్కారం కాదని, వ్యవస్థాపరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ మండల మహాసభ




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని : జులై 19 ఆదివారం మండల కేంద్రంలోని కామ్రేడ్ విజయ్ కుమార్ భవనంలో జరిగిన ఏఐవైఎఫ్ మండల మహాసభకు సభాధ్యక్షులుగా అబ్బురి మహేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం విద్యా రంగంలోని సమస్యలు ప్రైవేటీకరణ సామాజిక అసమానతలపై యువత చైతన్యవంతంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు యువత తమ హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని శాస్త్రీయ దృక్పథం సామాజిక బాధ్యతతో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు శ్రావణ్ జిల్లా సహాయ కార్యదర్శులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి చింతల రమేష్ ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి కొల్లి రవికుమార్ ఘనపరపు ఉపేందర్, మామిళ్ల కిరణ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను సింగారపు సత్యనారాయణ గోగుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు మహాసభలో నూతన మండల అధ్యక్షులుగా షేక్ హుస్సేన్ ప్రధాన కార్యదర్శిగా బోళ్ళ భాను వర్కింగ్ ప్రెసిడెంట్ గా గోగుల వెంకన్న ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబును వీరుతో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కద్వారా మంజూరు అయిన రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారి సిఫార్సు మేరకు వివిధ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం ఖర్చు పెట్టిన నేరడ గ్రామానికి చెందిన 5గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులు ను లబ్ధిదారులు కి అందజేశారు.
1) షేఖ బాబు 23500/-
2) షేఖ మీరాబి 32,500/-
3) గంగుల ఇందిరా 22500/-
4) చల్లా లక్ష్మి నారాయణ 16500/- 5)షాని మీరాబి మౌల్ సాహెబ్ 19000/-
6).పొన్నం రమేష్ లకు మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వర రావు ,ఉపసర్పంచ్ కోట బాలయేసు గ్రామ నాయకులు చెవుల తిరుపతి రావు ,పొన్న రమేష్ ,వనం పుల్లారావు , ౦ని బాబు కోట తిరుపతి వెంకులు సొంపుగు బాలకృష్ణ ,కనకపూడి శంకర్ రావు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా..ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క కి లబ్ధిదారులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినారు

## వికలాంగురాలుకి నిత్యావసర సరుకులు పంపిణీ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని: చిన్నమండవ గ్రామానికి చెందిన వికలాంగురాలైన కంకిపాటి నాగమ్మ కు ఆకలి అందరిది గ్రూప్ తరపున ఆదివారం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పర్స రామచంద్ర రావు, గ్రూపు సభ్యులు కూరపాటి మురళీ , మండేపూడి మదన్, భహాటం ఫణిరాజు, ఆలేటి గోపి, పడిశాల ముత్తారావు,
మేకల వెంకటేశ్వర్లు, దేశబోయిన కొండలు పాల్గొన్నారు.

# కొత్తగూడెం--పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రూ.14 కోట్లతో దమ్మపేట--పాల్వంచ నాలుగు లేన్ల రహదారి విస్తరణకు శంకుస్థాపన
- రూ.50 లక్షలతో సీసీ రోడ్డు.. మరో రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు
- పాల్వంచ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.. జీవో--76పై త్వరలో స్పష్టత
- రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**సికె న్యూస్ ప్రతినిధి కొత్తగూడెం :** కొత్తగూడెం--పాల్వంచ జంట పట్టణాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట--పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్టీ) నిధులు రూ.14 కోట్లతో చేపట్టనున్న రెండున్నర కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దమ్మపేట--పాల్వంచ రహదారి దెబ్బతిని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీనిపై స్పందించి అత్యవసరంగా రూ.14 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

పాల్వంచ ప్రాంతంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి పరివాహక ప్రాంత ప్రజలకు సంబంధించిన జీవో--76 అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇస్తామన్నారు. పాల్వంచలో కాలుష్య రహిత పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని, కొత్తగూడెం పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేశామని వివరించారు. సవాళ్లున్నా.. సంక్షేమంలో వెనకడుగు లేదు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ హామీల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిరంతరాయంగా సాగుతున్నాయన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ గృహాల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపామని, ఇప్పటికే 1.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. అలాగే, గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, 70 వేల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసి యువతకు భరోసానిచ్చామని గుర్తుచేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి**

జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మంత్రి కోరారు. నష్టాలు రాకుండా మెట్ట పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కమిషనర్ సుజాత, అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి శరణం. స్వామి శరణం



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు నిత్య అన్నదానము కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరము నిర్వహించే దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు 60 రోజుల అన్నదాన కార్యక్రమం నకు శాశ్వతముగా ఒకరోజు స్వాములకు భోజనం నిర్వహించడానికి శ్రీ చాగాపురము ప్రదీప్ స్వామి అడ్వకేట్ ఆలయ కార్యవర్గ సభ్యులకు ఒక లక్ష ఒక్కవేయి పదహారు(101016) రూపాయలు ఇవ్వడం అయినది ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు ఎందుకు వారికి ధన్యవాదములు తెలుపుతూ వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మరియు శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి సంపూర్ణ పలకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి వైన్డింగ్ రాములు అధ్యక్షులు టెంకాయల రవికుమార్ ప్రధాన కార్యదర్శి శామప్ప గురు స్వామి ఉపాధ్యక్షులు కే యం మురళి ఉపాధ్యక్షులు గారు వరప్రసాద్ గురు స్వామి.

# దేశానికి అన్నం పెట్టేవాడు రైతు...



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలో అనంతపురం గ్రామంలో గ్రామస్తులు వర్షం కోసం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామస్తులు రైతులు నిర్వహిస్తున్న మహా యజ్ఞం, ప్రత్యేక పూజలు వరుణ దేవుని కోసం నిర్వహించడం జరిగింది ....

చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనను ఎమ్మెల్యే సతీమణి తిలకించారు.

ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ..

వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడడం జరుగుతుంది. కాబట్టి గ్రామంలో గ్రామస్తులంతా కలిసి ప్రత్యేకంగా వరుణ దేవుని కోసం త్వరగా వర్షాలు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది.

గ్రామస్తులు చేసిన పూజలు ఫలించి దేవుడు త్వరగా వర్షాలను పడి రైతులకు మంచి పంటలు పండి మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని ఆ భగవంతున్ని వరుణ దేవుని ప్రార్థించడం జరిగింది.

రైతు అభివృద్ధి చెందుతాయి దేశం అన్ని రంగాల అభివృద్ధి చెందుతుంది...

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీనియర్ నాయకులు జయరామిరెడ్డి, మాజీ ఆలయ కమిటీ డైరెక్టర్ రాధామ్మ రెడ్డి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ..

- జేఏసీ వినతితో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో నిర్మాణం..
- ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కోదండరాం గద్దర్ కూతురు వెన్నెల, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ
- ఎమ్మెల్యే వీర్లపల్లికి ఉద్యమకారుల కృతజ్ఞతలు



**సి కే న్యూస్ షాద్ నగర్ :జులై 14:** తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడి చివరికి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి అమరవీరుల కోసం ఒక స్తూపం ఏర్పాటు పుష్కర కాలంగా కలగానే మిగిలింది. ఉద్యమాల ఐకాసా నాయకులు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చివరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఆ ప్రయత్నం సఫలం అయింది. పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణలో నిర్మాణం చేపట్టిన అమరవీరుల స్తూపాన్ని ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జయ జయ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కూడా ఈ కార్యక్రమానికి హాజరై అమరవీరులకు నివాళులు అర్పించడం విశేషం. ఐకాసా నాయకులు జనార్ధన్, పినపాక ప్రభాకర్, కరుణాకర్, టీజీ శ్రీనివాస్, గిరిధర్, కృష్ణయ్య, వంగూరి గంగిరెడ్డి, వి. రామారావు, సరాపు జగదీశ్వర్ తొలితరం ఉద్యమకారుడు నాగిళ్ళ గోపాలగుప్త, బిజెపి నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి, మంగులాల్ నాయక్, కలంకార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# పుష్కరాల లోపే భద్రాద్రి వైభవం!



- వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి కావాలి
- 15 రోజుల ముందే సిద్ధం చేయండి : అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- రూ.351 కోట్లతో పనులు.. రూ.75 కోట్లతో భూసేకరణ
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి.. పది రోజులకోసారి సమీక్ష చేస్తామని వెల్లడి

**సికె న్యూస్ ప్రతినిధి భద్రాచలం :** రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాచీన వైభవానికి ప్రతీకగా నిలిచేలా పునరుద్ధరణ పనులను వచ్చే గోదావరి పుష్కరాల నాటికి వంద శాతం పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాల ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ, ఇంజినీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మొదటి శ్రీరామనవమి పర్వదినాన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భద్రాద్రి పునరుద్ధరణకు నాంది పలికాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసింది. ఆలయ విస్తరణ, అభివృద్ధికి అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించాం" అని వివరించారు.

**- ఆగమశాస్త్రం ప్రకారం.. అదనపు కార్మికులతో!**

భద్రాద్రి క్షేత్ర ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టత చెక్కుచెదరకుండా, నిపుణులైన శిల్పులతో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. "పురాతన గోపురాలు, కట్టడాల సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రాల ప్రకారం పనులు జరగాలి. పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన చోట ప్రస్తుత సిబ్బంది కంటే 25 శాతం అదనంగా కార్మికులను నియమించాలి. నిరంతరం నిపుణులు, బాధ్యతాయుతమైన అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలి" అని ఆదేశించారు. ఒకవైపు పనులు పూర్తయిన తర్వాతే మరోవైపు పనులు ప్రారంభించాలని, ఎక్కువ పని ఉన్న ఉత్తర భాగంలో పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రాయింగ్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు.

**- పది రోజులకోసారి క్షేత్రస్థాయి సమీక్ష**

ఆలయ పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావును మంత్రి టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ ప్రతి 10 రోజులకోసారి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతిని పరిశీలించాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో భక్తుల విజ్ఞప్తుల మేరకు నూతన స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

తొలుత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రికి కలెక్టర్ అంకిత్ మొక్క అందించి స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో దామోదరరావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రికి వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం దొర, ఆర్కిటెక్ట్ మూర్తి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ మహంకాళి నల్ల పోచమ్మ ఆలయ కమిటీ నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న...



**తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య, (౧+ూ+ణజఖీూ) చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య**

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు అలంపూర్ జోగులాంబ ఆలయం లో హైదరాబాద్, మురాద్ మహల్, గౌలిపుర, శ్రీ శ్రీ శ్రీ మహంకాళి నల్ల పోచమ్మ ఆలయ కమిటీ నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక బోనం,వాడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు...

వారితో పాటు...ఏఐసీసీ సెక్రటరీ అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి , శ్రీ నల్లపోచమ్మ ఆలయ చైర్మన్ శ్యామరావు, అధ్యక్షుడు ప్రమోద్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నాగశిరోమణి, కౌన్సిలర్ అనిత నర్సింహులు, వరలక్ష్మి, సులోచన, శ్యామకుమార్, మణికంత, ఆలయ సిబందీ, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు....

# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు....

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

20వ తేదీ ( సోమవారం ) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

సోమవారం 20వ తేదీన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రస్తుత ఎల్ - నినో పరిస్థితులపై చేపట్టాల్సిన ముందస్తు చర్యల పట్ల జిల్లా ఇన్చార్జ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ. దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించే సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణి ద్వారా తమ సమస్యల పరిష్కారానికి వచ్చే జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురి కాకూడదని తెలియజేశారు.




## అధ్యక్షుడి పదవిపై ఉన్న ఆంక్షలు మంత్రి కొనసాగిస్తుందా.!

# కాలరాస్తదా.?

- "ప్రస్తుత రాజకీయ వేడిలో నూతన మార్పులు పార్టీ ఎదుగుదలకు ఉపయోగపడతాయా.?"
- "గ్రహణం పట్టిన మండల అధ్యక్ష పదవి?"
- "పేకాట రాయుళ్లతో రోడ్డు పాలవుతున్న అధికార పార్టీ."
- "మంత్రి ఆచితూచి అడుగు వేయకపోతే చిన్నభిన్నం కానున్న వెంకటాపురం కాంగ్రెస్ రాజకీయాలు..?"
- "ఏదేమైనప్పటికీ కారుకి కలిసి వస్తున్న కాలం."
- "గోడమీద పిల్లిలా నియోజకవర్గ నాయకుల మౌనం."
- "మంత్రి మౌనం మీద మండలంలో రాజకీయాలు."
- "అధిష్టాన నిర్ణయంతో కుటుంబ రాజకీయాలకు చెక్ పడనుందా.?"
- "పార్టీ కండువా నీడలో నాయకుల కాంట్రాక్టర్ల హవా."
- "పెద్దమనిషి తరహాలో పాడు పనులు చేస్తున్న నాయకుల మాట అధిష్టానం పాటిస్తుందా.?"
- "పార్టీలో విభేదాలకు ఆ నలుగురే కారణం అంటూ వినిపిస్తున్న ఆరోపణ ఎంతవరకు వాస్తవం.?"
- "టెండర్ చేదించిన కాంట్రాక్టర్స్ వెనుతిరిగి వెళ్లడానికి కారణం ఎవరు.?"
- "రహదారి మరమ్మత్తుల కాంట్రాక్టర్ల కోసం, తెలం ఎదురుచూపులు."

"ములుగు జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి భార్గవ్."

వెంకటాపురం మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకం ఇంకా పెండింగ్‌లో ఉండటం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. మండలానికి కొత్త అధ్యక్షుడిని ప్రకటించడంలో అధిష్ఠానం ఎందుకు జాప్యం చేస్తోంది? అసలు ఈ ఆలస్యానికి కారణం స్థానిక రాజకీయ సమీకరణాలా? లేక అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నాయకుడి కోసం ఎదురుచూస్తోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి..

ఇటీవలి కాలంలో మండల కాంగ్రెస్‌లో నాయకత్వంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవైపు పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేసిన సీనియర్ నాయకులు తమ సేవలకు గుర్తింపు రావాలని ఆశిస్తుండగా, మరోవైపు యువ నాయకత్వానికి అవకాశం కల్పించాలనే డిమాండ్ కూడా బలపడుతోంది..

అధికారం కొద్ది మంది కుటుంబాలకే పరిమితం కావడం వల్ల సాధారణ కార్యకర్తలకు అవకాశాలు దక్కడం లేదనే భావన కొంతమంది కార్యకర్తల్లో వ్యక్తమవుతోందని ప్రచారం జరుగుతోంది.. పార్టీ కోసం గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది..

మండల అభివృద్ధి, పార్టీ విస్తరణ, గ్రామస్థాయి కార్యకర్తల ఐక్యతకు ప్రాధాన్యత ఇచ్చే నాయకుడిని ఎంపిక చేయాలని అధిష్ఠానాన్ని కోరుతున్న స్వరాలు పెరుగుతున్నాయి. వ్యక్తిగత వర్గ రాజకీయాలకు అతీతంగా పార్టీ సిద్ధాంతాలను నమ్మి పనిచేసే నాయకుడికే బాధ్యతలు అప్పగించాలని కార్యకర్తలు కోరుతున్నారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు..

అయితే, మండల అధ్యక్షుడి ఎంపికలో అధిష్ఠానం సీనియర్ నాయకుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటుందా? లేక స్థానిక రాజకీయ సమీకరణాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. తీసుకునే నిర్ణయం పార్టీని మరింత బలోపేతం చేస్తుందా? లేక అంతర్గత విభేదాలకు దారితీస్తుందా? అనే చర్చ కూడా సాగుతోంది.

వెంకటాపురం మండల కాంగ్రెస్ భవిష్యత్తును నిర్ణయించే ఈ నియామకం సాధారణ పదవి కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకుడికి అవకాశం కల్పిస్తే కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొనే అవకాశం ఉందని అంటున్నారు..

ప్రస్తుతం కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మండల అధ్యక్షుడి ఎంపికలో పార్టీ సిద్ధాంతాలు, కార్యకర్తల అభిప్రాయాలు, ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇస్తుందా? లేక వేరే రాజకీయ సమీకరణాలు ప్రభావం చూపుతాయా? అన్నది త్వరలో తేలనుంది..అధికార పార్టీ అండతో అక్రమాలకు అడ్డూ అదుపూ లేదా..?

ఆధారాలు బయటపెడుతున్న మౌనం పాటిస్తున్న ప్రభుత్వం. ప్రభుత్వ వైఖరికి ప్రజల్లో పలు అనుమానాలు... నిష్పక్షపాత విచారణకు డిమాండ్, అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు పార్టీ పేరును అడ్డం పెట్టుకుని వరుస అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రభుత్వ భూములు, సహజ వనరులు, కాంట్రాక్టులు, ప్రజా ఆస్తులకు సంబంధించిన అంశాల్లో నిబంధనలను పక్కనబెట్టి కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి సోషల్ మీడియాతో పాటు మీడియా సంస్థలు పలు ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నప్పటికీ, విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం మౌనం పాటించడం ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది...ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా, మీడియా ఆధారాలతో కథనాలు ప్రసారం చేస్తున్నా, సంబంధిత శాఖల నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల ఈ మౌనం వెనుక అసలు కారణం ఏమిటి? రాజకీయ ఒత్తిళ్లా? లేక అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల నోట వినిపిస్తున్నాయి...ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ఒక బాధ్యత. ఆ కథనాలను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను నిర్ధారించి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. అయితే ఆరోపణలు బయటకు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం వల్ల ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రజల్లో సందేహాలు పెరుగుతున్నాయి...అధికార పార్టీ అండదండలు ఉన్నాయనే ధీమాతోనే కొందరు నాయకులు చట్టాన్ని లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, ఈ ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది...అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి హోదాలో ఉన్నా, ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం తన పని తాను చేసుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. విచారణ ఆలస్యం అయితే ఆధారాలు మారిపోయే ప్రమాదం కూడా ఉందని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు..ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, మీడియాలో వెలుగుచూసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిజానిజాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే అధికార పార్టీ నాయకులకు అధికార యంత్రాంగం అండగా నిలుస్తోందనే విమర్శలు మరింత బలపడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు..ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. అధికారుల మౌనం వీడుతుందా? అక్రమాలపై చట్టం తన పని చేస్తుందా? లేక ఇవన్నీ ఆరోపణలుగానే మిగిలిపోతాయా? అనే ప్రశ్నలకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.